మెట్టలో వీడని ఉత్కంఠ

- కోడి పందేల నిర్వహణపై సర్వత్రా ఉత్కంఠ
- ససేమిరా అంటున్న యంత్రాంగం
- అనుమతుల కోసం పందెం నిర్వాహకుల ఎదురుచూపు
- రాజకీయ నాయకులపై ఒత్తిడి



చింతలపూడిలో పందెం కోళ్లు



లింగపాలెం మండలంలోని ఓ తోటలో పెంచుతున్న పందెం కోళ్లు

చింతలపూడి : కోడి పందేల నిర్వహణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భోగి పండుగ నుంచి మూడు రోజుల పాటు యథేచ్ఛగా పందేలు నిర్వహిస్తుంటారు. అయితే ఈసారి పందేల నిర్వహణను అడ్డుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంది. ఏటా ముందు పందాలు నిర్వహించరాదని ఆదేశాలు ఇవ్వడం, ఆ తరువాత పట్టు సడలించడం మామూలే అయినా ఈసారి మాత్రం అందుకు తగ్గ పరిస్థితులు కనిపించడం లేదు. కోడిపందేలను జరపడానికి వీల్లేదని హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ ఏడాది పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ ఆదేశాలతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎక్కడికక్కడ గ్రామాల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా సంప్రదాయ క్రీడలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పందేల నిర్వాహకులను గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలోని మెట్టప్రాంతమైన చింతలపూడి నియోజకవర్గంలోని చింతలపూడి, సీతానగరం, రాఘవాపురం, లింగపాలెం మండలం కొణిజర్ల, ములగలంపాడు, కామవరపుకోట మండలం కళ్ళచెర్వు, రావికంపాడు, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, లక్కవరం తదితర గ్రామాల్లో ఏటా భారీగా పందేలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా అందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సంక్రాంతి వేడుకల్లో కోడిపందేలకు అధిక ప్రాధాన్యత ఉండటంతో చివరి నిమిషంలో ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావడంతో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించక తప్పడం లేదు. సంక్రాంతి మరో వారం రోజులే ఉండటంతో డెల్టా ఏరియాకు దీటుగా మెట్టలో కూడా కోడి పందాలను నిర్వహించడానికి రాజకీయ నాయకులపై నిర్వాహకులు ఇప్పటి నుంచే వత్తిడి చేస్తున్నట్లు సమాచారం. పండుగ నాలుగు రోజులు ఈ ప్రాంతం జాతరను తలపిస్తుంది.

మెట్టప్రాంతంలోనూ అదే జోరు

లింగపాలెం : ఒకప్పుడు డెల్టాప్రాంతం లోనే ఎక్కువగా కోడిపందాలు నిర్వహించేవారు. కానీ నేడు మెట్ట ప్రాంతాల్లో కూడా దీటుగా కోడిపందాలు నిర్వహిస్తున్నారు. కేవలం కొంత మంది సంక్రాంతి పండుగకు పందాలు నిర్వహించడం కోసం వేలాదిరూపాయిలతో కోడిపుంజులు కొనుగోలుచేసి పందెం పుంజులను మేపుతున్నారు. ఇప్పటికే లింగపాలెం మండలంలో పెద్ద సంఖ్యలో పందెంకోళ్లు సిద్ధంగా ఉన్నాయి. ఒక్కక్క పుంజును రూ.20 వేలు నుంచి రూ.45 వేల వరకు కొనుగోలు, విక్రయాలు చేస్తున్నారు, ఒక్కో కోడికి నెలకు రూ 3,500 వరకూ ఖర్చు చేసి మేపుతున్నారు. లింగపాలెం మండలంలో నిర్వహించే కోడిపందాలకు మండల ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందినవారు, ఇతర జిల్లాల నుంచి పందేలరాయుళ్లు పెద్ద ఎత్తున తరలివస్తూంటారు. ఈ ప్రాంతానికి చెందిన వారే అధిక సంఖ్యలో హైదరాబాద్, బెంగుళూరు, కర్నాటక, తదితర రాష్ట్రాలలో నివసిస్తున్న వారు సైతం సంక్రాంతి పండుగకి ఇక్కడకు వచ్చి పండుగ మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా గడిపి వెళ్లటం జరుగుతుంది. భారీ స్థాయిలో నిర్వహించే పందాలకు కోట్లాది రూపాయిలు చేతులు మారుతుంటాయి. పందేలు వేసేందుకు మండలంలోని 4 నుంచి 5 ప్రదేశాల్లో పందెం బిరులను ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ జోడి పందెలు వేసేందుకు ఇతర జిల్లాలకు చెందిన పందెం రాయుళ్లతో బ్యాచీలుగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఒకొక్క పందెం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరగనున్నట్లు సమాచారం.

కఠినంగా వ్యవహరిస్తాం



కోడి పందేల నిర్వహణ చట్ట విరుద్ధం. సంక్రాంతి ముసుగులో సర్కిల్ పరిధిలో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కోడి పందేల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. చట్ట విరుద్ధంగా ఎక్కడైనా కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సర్కిల్ పరిధిలో పందెంరాయుళ్లపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటికే సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశాం.

– ఎంవీఎస్ మల్లేశ్వరరావు, సీఐ, చింతలపూడి

భోగిమంటల వేళ.. ఆవు పిడకల ధూపం



కొయ్యలగూడెంలో భోగి పిడకలను చూపుతున్న చిన్నారులు

కొయ్యలగూడెం : తెలుగువారికి అతి ముఖ్యమైన పండుగలలో సంక్రాంతిది అగ్రస్థానం. భోగి, మకర సంక్రాంతి, కనుమ, మూడు రోజులు సాంప్రదాయపరంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. భోగి రోజున నిర్వహించే భోగి మంటలలో ఆవు పేడతో వేసిన పిడకలను దండల కూర్చి అగ్నిహోత్రంలో బాలలు సమర్పిస్తుంటారు. ఆధునిక పోకడలతో మసకబారుతున్న భోగి పిడకల సంప్రదాయాన్ని ఇప్పటికీ మారుమూల ప్రాంతాలలోని కొందరు ఆచరిస్తూ భావితరాల వారికి దాని ప్రాముఖ్యతను చాటుతున్నారు. సాంప్రదాయపరంగా భోగిపిడకలను భోగిమంటలలో చిన్నారుల చేత వేయించడం వల్ల శ్రీ గోదారంగనాధుల ఆశీస్సులు లభిస్తాయని ప్రతీతి. శాస్త్రీయంగా భోగి పిడకలను మంటలలో వేసి కాల్చడం వల్ల ఆక్సిజన్ శాతం పెరుగుతుందని అదే సమయంలో తీవ్రమైన చలి కలిగి ఉన్న వాతావరణంలో ఉన్న సూక్ష్మ క్రిములను భోగి మంటలలో వేసిన ఆవు పిడకల ద్వారా వచ్చే ధూపం నాశనం చేస్తుందని నిరూపితమైంది.

క్లుప్తంగా

డాక్టర్ సిగ్దర్ సేవలు ప్రశంసనీయం



కొయ్యలగూడెంలో సిగ్దర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : సీపీఐ సీనియర్ నాయకుడిగా, పేదల డాక్టర్‌గా తరుణ్ సిగ్దర్ సేవలు ప్రశంసనీయమని సీపీఐ మండల పార్టీ పేర్కొంది. ఇటీవల మృతి చెందిన సిగ్దర్ సంస్మరణ కార్యక్రమం ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించారు. కొయ్యలగూడెంలో మూల వ్యాధుల డాక్టర్‌గా పేరుగాంచిన తరుణ్ సిగ్దర్ ఎంతోమందికి ఉచిత సేవలందించాలన్నారు. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం సిగ్దర్ కలకత్తా నుంచి వచ్చి స్థిరపడి కమ్యూనిస్టుగా ఉద్యమాలు చేపట్టారన్నారు. కుటుంబ సభ్యులు ఎవ్వరు లేకపోవడంతో మిత్రులు హోంగార్డ్ ముస్తఫా, తాడిగడప ఆంజనేయరాజు తదితరులు సిగ్దర్ స్మృత్యర్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సర్పంచ్‌ల ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తుక్కయ్య



చిన్న తుక్కయ్య

కొయ్యలగూడెం : సర్పంచ్‌ల ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాను నియమితుడైనట్లు రాజవరం గ్రామ సర్పంచ్, కొయ్యలగూడెం సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు వేలేటి చిన్న చుక్కయ్య ఆదివారం పేర్కొన్నారు. విజయవాడ మాచినేని విజ్ఞాన భవనం కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర సర్పంచుల సమావేశంలో తనకు నియామక పత్రాన్ని అందించారన్నారు. సర్పంచుల ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు జిల్లాకు చెందిన చిలకలపూడి పాపయ్య ఏకగ్రీవంగా ఎంపిక అయ్యారన్నారు. ప్రధాన కార్యదర్శిగా అల్లు విజయకుమార్ (కాకినాడ జిల్లా), వరి శ్రీదేవి కోశాధికారిగా (ఎన్టీఆర్ జిల్లా) నియమితులయ్యారన్నారు. ఈ సందర్భంగా తుక్కయ్య మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజును కలిసి అభినందనలు అందుకున్నారు.

కోడిపందేలపై దాడి

జంగారెడ్డిగూడెం : కోడిపందాలపై దాడి నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. స్థానిక మార్కండేయపురం సమీపంలో కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి జి.చిన్నరాజు మరో ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి కోడి, ఒక కోడి కత్తి, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

చింతలపూడి : చింతలపూడి మండలం, గురుభట్లగూడెం గ్రామంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. దాడిలో 6 గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మున్సిపాలిటీకి చెత్త సేకరణ రిక్షాల అందజేత



చెత్త సేకరణ రిక్షాలను అందిస్తున్న తపప ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి చౌదరి

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీకి తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి చౌదరి మూడు చెత్త సేకరణ రిక్షాలను ఆదివారం అందజేశారు. మునిసిపల్ కమిషనర్ భవాని ప్రసాద్‌కు వీటిని అందజేశారు. జంగారెడ్డిగూడెం 17వ వార్డులోని వాజ్‌పేయి సెంటర్ వద్ద నిర్వహించిన చెత్త సేకరణ రిక్షాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గారపాటి చౌదరి మాట్లడారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు తపన ఫౌండేషన్ తరపున వీటిని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, బీజేపీ నాయకులు అర్జున మురళి, పెనుమత్స రంగరాజు, గొట్టుముక్కల రామచంద్రరాజు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, చీరల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరంలో రావిపాటి సత్యనారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు 50 దుప్పట్లు, 50 చీరలు పంపిణీ చేశారు. శ్రీ రామచంద్ర విద్యాసంస్థ ఏవో రమేష్, యూటీఎఫ్ నాయకులు జి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా వీటిని అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు రావిపాటి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

జూదాలు ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ద్వారకాతిరుమలలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



ద్వారకాతిరుమలలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల : సంక్రాంతి పండుగ పేరుతో జూదాలు ఆడి జీవితాలను నాశనం చేసుకోవద్దని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు యువతకు సూచించారు. సంప్రదాయ క్రీడలే ముద్దు.. జూదాలు వద్దు అంటూ ద్వారకాతిరుమల పోలీసువారు శ్రీవారి దేవస్థానం పాఠశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పేరుతో కొంత మంది యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారని, జూదాలు ఆడి, అప్పులపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. దీని వల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగనాడు అందరూ తమ కుటుంబాలతో కలసి ఆనందంగా గడపాలన్నారు. పండుగ పేరుతో యువతను సన్మార్గంలో పెట్టేందుకు సంప్రదాయ క్రీడా పోటీలను నిర్వహిస్తున్న పోలీస్ శాఖను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఎస్సై టి.సుదీర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ పైడేశ్వరరావుల ఆదేశాల మేరకు, భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సంక్రాంతి పండుగ రోజుల్లో యువత కోడిపందాలు, పేకాట, గుండాట వంటి జూదాలకు దూరంగా ఉండాలన్నారు. సంప్రదాయ క్రీడలతోనే శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, అంబటి గాంధి, యిమ్మడి పవన్‌కుమార్, యిమ్మడి నాగు, ఉక్కుర్తి వెంకట్రావు, రుద్రశివ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, బొండాడ వెంకన్నబాబు, గుర్రాల లక్ష్మణ్, మానుకొండ సుబ్బారావు, బాలం వెంకటేశ్వరరావు, లక్కాబత్తుల సిద్ధిరాజు తదితరులున్నారు.

శ్రీవారి అన్నదాన భవన కార్మికుల ఆందోళన



శ్రీవారి కొండపైన అన్నదాన భవనం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న నిత్యాన్నదాన భవనంలో పనిచేసే కొందరు కార్మికులు ఆదివారం ఆందోళన బాటపట్టారు. తమను అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి, జీతభత్యాలు పెంచాలని అన్నదాన భవనం వద్ద భైటాయించి నినాదాలు చేశారు. వివరాలు ప్రకారం. నిత్యాన్నదాన భవనంలో గత పదేళ్ల క్రితం నుంచి 40 మంది కార్మికులు కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కొక్కరూ నెలకు రూ.10 వేలు జీతం అందుకుంటున్నారు. అయితే ఇటీవల అన్నదాన భవనంలో నూతనంగా నియమితులైన 20 మంది కార్మికులను అవుట్‌సోర్సింగ్‌లో చేర్చి, ఒక్కొక్కరికి నెలకు రూ.18 వేలు జీతం ఇస్తున్నారు. దీంతో పాత 40 మంది కార్మికులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమను కాంట్రాక్టు ఉద్యోగులుగానే ఉంచి, నిన్నకాక మొన్న కొత్తగా వచ్చిన వారిని అవుట్‌సోర్సింగ్‌లో చేర్చి, వారికి నెలకు రూ.18 వేలు జీతం ఇవ్వడం అన్యాయమని ధ్వజమెత్తారు. తమను కూడా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, అలాగే జీతభత్యాలను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు వివరణ ఇస్తూ అన్నదాన భవన కార్మికుల ఆందోళన అంశం పూర్తిగా కాంట్రాక్టరుకు సంబంధించిందని అన్నారు. కార్మికులు, కాంట్రాక్టర్ ఇరువురు చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే గెలుపు

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- జంగారెడ్డిగూడెం 28వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం : ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల కోసమే పనిచేసే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని, ప్రజలకు మరింత మెరుగైన సంక్షేమం అందించే దిశగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం 28వ వార్డు లోకేషనగర్‌లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్ ఎలీజా ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరిస్తూ, సమస్యల గురించి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు కార్యాలయాలకు పరిమితం కాకుండా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి సాధక బాధలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేలా కృషిచేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం దిశా నిర్దేశం చేస్తున్నారన్నారు. గడపగడపకు కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా పథకాల ద్వారా ఎలా లబ్ధి చేకూరిందో ప్రజల నుంచి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉన్నారా, వారికి ఇప్పటి వరకు ఎందుకు లబ్ధి చేకూరలేదో తెలుసుకుని, వారికి కూడా ప్రభుత్వ పథకాలను అందించేలా అధికారులను ఆదేశించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంటింటికీ వెళుతున్న తమకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఈ ఒరవడి చూస్తుంటే తదుపరి ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీయే విజయ బావుటా ఎగురవేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఐసీడీఎస్ రీజనల్ కో–ఆర్డినేటర్ వందనపు సాయిబాల పద్మ, వైస్ చైర్మన్‌లు ముప్పిడి వీరాంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పీపీ చంద్రరావు, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సాయిల స్వాతి, కౌన్సిలర్ కసుమూరి లావణ్య, చిటికెల అచ్యుత రామయ్య, ఎల్‌వీఆర్, నేట్రు సుబ్బలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు బత్తిన చిన్న, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, కాటం ప్రసాద్, పీడీ, షేక్ అమీర్, చింత అనిల్‌కుమార్ గౌడ్, కళ్యాణ్‌వర్మ, గంజి వినోద్, తల్లాడి సంజయ్, పోలీసు, మునిసిపల్, మెప్మా, హౌసింగ్, ఎలక్ట్రికల్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక వర్గం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధర్ముల సురేష్

జంగారెడ్డిగూడెం : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ పిలుపునిచ్చారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య జంగారెడ్డిగూడెం డివిజన్ రెండవ మహాసభ మంచిలి రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ధర్ముల సురేష్ మాట్లాడుతూ కార్మిక వర్గం అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దుచేసి కార్మిక వర్గానికి ద్రోహం చేసిందని విమర్శించారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ ఇఫ్టూ కేంద్రం కమిటీ ప్రచురించిన నోట్ వివరించి కార్మిక వర్గ కర్తవ్యాలను వివరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోనం చిన్నబ్బాయి ఉ,పాధ్యక్షుడిగా ఎడ్లపల్లి బుజ్జియ్య దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా మంచిలి రాజు, కార్యదర్శులుగా ముప్పిడి అబ్బులు, తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, కోశాధికారి టి.రాజితో కలిపి 21 మంది కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది యు.ఏసుబాబు, పీడీఎస్‌యు మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రామ్మోహన్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కారం రాఘవ, బోణంగి చిన్నబ్బాయి పాల్గొన్నారు.

వినోదంతో ఆహ్లాదం



సీఎస్ఆర్ మాల్ వైఎస్‌టీడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సినీనటి పాయల్ రాజ్‌పుత్, ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం : పట్టణంలో సీఎస్ఆర్ మాల్ వైఎస్‌టీడీ సెంటర్‌ను ప్రముఖ సినీ నటి పాయల్ రాజ్‌పుత్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం దినదినాభివృద్ధి చెందుతోందని, అందుకు అనుగుణంగా మెరుగైన వసతులు సమకూరడం పట్టణానికి మరింత శోభ చేకూరుతుందన్నారు. సినీ నటి పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ కోవిడ్ అనంతరం వినోదంలో ఓటీటీ భాగం కావడంతో థియేటర్స్‌కు వచ్చే వారికి సంఖ్య తగ్గుతోందన్నారు. ఇటువంటి సమయంలో ఒక పక్క వినోదాన్ని అందిస్తూ, మరో పక్క ఆహ్లాదాన్ని పంచేలా సీఎస్ఆర్ మాల్ వైఎస్‌టీడీ సెంటర్ నిర్మించడం శుభ పరిణామం అన్నారు. ఇక్కడి ప్రజల ఆదారాభిమానులు చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. మాల్ నిర్వాహకులు యార్లగడ్డ వెంకట రత్నకుమార్, చెరుకూరి నరేన్ మాట్లాడుతూ మల్టీప్లెక్స్‌లో ఈ నెల 12 నుంచి చిత్ర ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, బంగారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో వైభవంగా దీపోత్సవం





పారిజాతగిరిలో దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, గోదాదేవికి సారెను తీసుకువచ్చిన వికాస తరంగిణి సేవా సంస్థ సభ్యులు →

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఆదివారం 24వ రోజు దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గోదాదేవి శ్రీకృష్ణునికి మంగళశాసనము చేసిన విధముగా ధర్మ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరూ విశేషముగా అలంకరించిన పల్లెములలో ఆవు నేయి దీపములను వెలిగించి మంగళశాసన పాశురమును పఠిస్తూ హారతులు సమర్పించారు. అనంతరం జంగారెడ్డిగూడెం వికాస తరంగిణి సేవా సంస్థ ఆధ్వర్యంలో గోదాదేవికి పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రములు, ఫలా, పుష్పాలతో సారె సమర్పించారు. అనంతరం భక్తులు పారిజాతగిరి కొండ చుట్టూ నూతనముగా ఏర్పాటు చేయబడిన మార్గములో గోవింద నామ స్మరణలతో గిరి ప్రదక్షిణ చేశారు. సారెలో అమ్మవారికి సమర్పించిన గాజులు వివిధ రకముల ఫలములు ప్రసాదంగా భక్తులకు అందజేశారు. అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు, రిషికేష్, రాఘవాచార్యులు, కుమారాచార్యులు, పూజా కార్యక్రమములు నిర్వహించారు. భక్తులకు సూర్య డెంటల్ ఆసుపత్రి డాక్టర్ శివరామ్ దంపతులు, వికాస తరంగిణి సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు రామసత్య వీర వెంకట అప్పారావు, శ్యామలాంబ, సత్యనారాయణ, డాక్టర్ శివరాం కుమార్, శ్రీరామచంద్రమూర్తి, దిప్పకాయలపాడు వికాస తరంగిణి సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతి రాజు, దండు ధనరాజు, వాసవి నగేష్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు, పర్యవేక్షకుడు వెంకట ప్రసాదరావు పర్యవేక్షించారు.

నేడు వీరన్నపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం

బుట్టాయగూడెం: వీరన్నపాలెం, రామారావుపేట సెంటర్, సూర్పవారిగూడెం బీసీ కాలనీ, మర్రిగూడెం, ఇప్పలపాడు గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొంటారన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త వెంకటేష్‌కు పరామర్శ



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట : తడికలపూడి వైఎస్సార్ సీపీ కార్యకర్త గొరెడ్డి వెంకటేష్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఎలీజా పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకటేష్ కుమారుడు శ్రీనివాసరెడ్డి మృతి చెందాడు. వెంకటేష్ కుటుంబానికి ఎమ్మెల్యే ఎలీజా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే వెన్నుముక అని వారికి పార్టీ అండగా ఉంటుందని ఉన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలు త్వరగా వచ్చేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. పార్టీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు, టౌన్ కన్వీనర్ నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనల్స్ డైరెక్టర్ పండు జగదీష్, తడికలపూడి సొసైటీ చైర్మన్ గుర్రాల రవి, గంటా సత్యంబాబు, కరుటూరి బాలస్వామి, వి.శ్రీను, షేక్ మీరావలి, ముసునూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

మిర్చి రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): తామర, నల్లి పురుగు, వైరస్ తెగుళ్ళతో నష్టపోయిన మిర్చి రైతులను ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏలూరు జిల్లాలో వేలాది ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగు చేస్తున్నారని,తామర నల్లి పురుగు, వైరస్ తెగులను రాష్ట్ర విపత్తుగా ప్రకటించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.